# దొరకుట పోవుట కొరకే

"పెరుగుట విరుగుట కొరకే. పరిపూర్ణ సుఖంబు లధిక బాధల కొరకే" అన్నాడు సుమతీ శతక కారుడు. అల్లాంటి పద్యం ఏదైనా మా రాఘవరావుకి అన్వయించేది చెప్పాలనుంటుంది నాకు.

కాని నాకు పద్యాలల్లడంరాదు.

రాఘవరావు స్వభావం మీద నేను చెప్పాలనుకుని కూడా చెప్ప లేక వొదిలేసిన పద్యం "పెరుగుటా విరుగుటా"కి సంబంధించినది కాదు.

"పోవుటా దొరకుటా"కి సంబంధించింది అది.

సాధారణంగా సిటీబస్‌లో పిక్‌పాకెట్ వాతపడిన పర్సుగాని-

రైల్వే కంపార్ట్‌మెంట్ కక్కోసులో జారిపోయిన చిల్లర డబ్బులు గాని-

రాధారీ బంగళా బాత్‌రూమ్‌లో స్నానం చేస్తూ పక్కని పెట్టేసి మర్చిపోయిన వుంగరంగాని మళ్ళీ దొరికే ప్రసక్తి వుండదు.

కాని మా రాఘవరావు మాత్రం ఈ సూత్రం తనకి వర్తించ దంటాడు. ఈ ప్రసంగం వచ్చిదంటే చాలు, తనవి ఎన్నిసార్లు ఎన్ని వస్తువులు ఎలా యెలా పోయి మళ్ళీ ఎంతెంత అత్యాశ్చర్య పరిస్థితుల్లో దొరికాయో వివరిస్తూ గంటలు గంటలు గడిపేస్తాడు.

ఆరేళ్ళ కిందట మా వూళ్ళో ఒక బ్యాంక్ అంతకు ముందున్న అద్దె భవనం వదిలి స్వంత భవనంలోకి మారింది. కొత్త (స్వంత) భవనానికి అన్నీ అధునాతనమైన ఆటోమేటిక్ డోర్ లాక్‌లు ఏర్పాట వడం వల్ల పాత భవనంలో వుపయోగించిన బరువైన తాళంకప్పల అవసరం తీరిపోయింది. అంచేత వాటిని 'బహిరంగ వేలం'లో విక్ర యించేరు (వేలం మరీ బహిరంగం కాదు, వేలంనోటీసు సంగతి ముఖ పరిచయం వున్న కొద్దిమందికి మాత్రమే తెలియనిచ్చారు. ఆ సంగతి చాలామందికి తెలుసు, అది వేరే విషయం). అందులో రెండు పెద్ద పెద్ద కప్పలు (డూప్లికేటు తాళంచెవులు లేనివే) కొన్నాడు రాఘవరావు. రెండేళ్ల గడిచేక ఆ తాళాలు (రెండూ ఒక్కలాగున వుండేవి) ఎక్కడో పడిపోయాయి. కప్పలు రెండూ గొళ్ళాలకే వుండిపోయాయి.

వాటిని పగలగొట్టడానికి ప్రయత్నిస్తే ద్వారాలే కదిలి వచ్చేటట్లు కనబడి వాటినలా వదిలేశారు. ఆ తరువాత కొన్నాళ్ళపాటు ఇంటికి తాళం పెట్టుకునే సావకాశం లేక ఇంట్లో ఎవరో నౌకరు వుంటూనే వొచ్చారు పాపం.

అయితే, ఎలా పట్టేడో రాఘవరావు సరిగ్గా రెండేళ్ళ తరువాత "కురపాం మార్కెట్"లో పాత తాళం కప్పలకొట్లో అవే తాళాలు అదే రింగుతో సహా పట్టేశాడు!

ఓ సారి జీతం కాదుగానీ- రాఘవరావు డబ్బు పోగొట్టుకున్నాడు....

ఆఫీస్ పనిమీద ఢిల్లీ వెళ్ళొచ్చి టి. ఏ. బిల్ పాస్ చేయించుకుని అడ్వాన్సు పోను రెండువందల ఎనభై రూపాయలు పుచ్చుకున్నాడు. ఇద్దరం కలిసే తిరిగాం. కాని తీరా అతను ఇంటికొచ్చి చూసుకుంటే డబ్బు లేదు.

ఆలోచించాం, ఆఫీసునుంచి ఇంటికొచ్చిన దారీ పద్ధతి.

ఆఫీస్‌లో బయల్దేరి కాఫీ హోటల్‌కెళ్ళి వన్‌బై టూ తాగేం. చెరొక కిళ్ళీ వేసుకొన్నాం. అఫీషియల్ కాలనీ వరకు నడచివెళ్ళి హరి గోపాల్ ఇంట్లో కొంతసేపు గేటుకి ఇటూ అటూ ఆనుకొని నిలబడి కొంతసేపు బాతాఖానీ కొట్టాం. అక్కణ్ణించి కలెక్టరాఫీస్‌కి వెళ్ళి టెలిఫోన్ రూమ్‌లో రషీద్‌ని పలకరించేం. "యలమంచిలికి శిరస్తా దార్‌గారు కాల్ బుక్‌చేసేరు గురూ, మీ తమ్ముడితో మాట్లాడతావు గాబోలు కూర్చో" అని అతనంటే ఆ కాల్ వచ్చేదాకా అక్కడ కూర్చుని, టెలిఫోన్‌లో పది నిమిషాల పాటు మాట్లాడాడు. అక్కణ్ణించి కృష్ణచైతన్య మఠానికి వెళ్ళి అరగంటపాటు భజనలో పాల్గొన్నాడు. ఆ అరగంటలో, హార్మోనిస్టు దమ్ముకొట్టుకొస్తానని ఇతనికి సంజ్ఞ చేస్తే హార్మోనియం పట్టుకున్నది పావుగంట.

"ఈ మజిలీల్లో డబ్బు యెక్కడ పోయిందో, ఇహ పట్టిదే" అని నేను నిరుత్సాహపరిచాను. కాని, మర్నాడు నా ప్రావిడెంట్ ఫండ్ లోన్ చెల్లిస్తారు కనుక అందులో మూడువందలు అప్పుగోకుతాడని భయపడుతూనే వున్నాను. "పోన్లే. నువ్వు ఇంటికెళ్ళిపో, నేను

వెతుక్కుని వస్తాను. దొరికిందా సరేసరి, లేకపోతే రేపు ఆ మాత్రం అప్పుపెట్టక పోతావా?" అని నాకు వీడ్కోలిచ్చాడు. మూడువందలు అప్పు ఇవ్వవలసొచ్చిందే అని ఆరాత్రి నాకు సమంగా నిద్రే పట్టలేదు.

కాని మర్నాడు రాఘవరావు టింగురంగా అన్నట్టున్నాడు ఆఫీసులో. నేనేదో సానుభూతి వాక్యాలతో గుడ్ మార్నింగ్ చెప్పబోతూ వుండగానే, "ఎందుకు? డబ్బు దొరికేసిందిగా!" అన్నాడు.

కిళ్ళీ కట్టించుకుంటూ కొట్టుఆసామితో రాజకీయాలు మాట్లాడుతూ పిప్పరమెంటు తినాలనిపించి సీసా మూత వూడదియ్య బోయాడట. అది ఓ పట్టాన వూడిరాకపోతే నీ సంగతి ఇల్లా వుందా అని చేతిలో వున్న పుస్తకం సీసాల వరస వెనక చారబెట్టి పిప్పరమెంటు సీసా మూత వూడదీసి పిప్పరమెంటు లాగాడట.

వొచ్చిన దార్నే వెళ్ళి కిళ్ళీ కొట్టు చేరేసరికి "సార్, సార్, పుస్తకం మర్చిపోయార్ సార్!" అని అందించాడట కిళ్ళీ కొట్టబ్బాయి.

ఆ పుస్తకంలో, తను పెట్టినవి పెట్టినట్టే వున్నాయట, రెండు వందల ఎనభై రూపాయలున్నూ. "పుస్తకం వనితా విత్తం పరహస్తం గతం గతః అంటారుగానీ చూడు, నా పుస్తకం విత్తం కూడా నాకు తిరిగి చేరిపోయాయి. ఇప్పుడైనా తెల్సిందా, పోవుట దొరుకుట కొరకే!" అని దర్పంగా, చనువుగా, అతని మీసం ఓ చేత్తోను, నా చెవి మరో చేత్తోను మెలితిప్పాడు రాఘవరావు.

"వనిత మధ్య నుండిపోయింది. ఒకసారి ఇతరు లెవ్వరికైనా వదిలి చూడు, తిరిగి వొస్తుందో రాదో" అని నేనుగాని ఎవరూగానీ ఛాలెంజ్ చెయ్యలేరు కదా.

మొన్న నీ మధ్య వొకరోజున రాఘవరావు అనకాపల్లి వెళ్ళి రైల్లోవస్తూ, రైల్వే స్టేషన్ దగ్గిర సిటీ బస్సెక్కి ఇంటికొచ్చేడు. ఆ బస్సు కలెక్టరాఫీస్ దగ్గిర ఆగిపోయే నెంబరు నలభై ఆరు. స్కాట్లండ్ వీరుడిలా, ఎవరైనా ఏమైనా మర్చిపోతారేమో చూసేవాడిలా అందరూ దిగిపోయేవరకు కూర్చున్న రాఘవరావుకి సరిగ్గా తన సీటుకిందనే ఓ

జెర్మన్ సిల్వర్ కారేజీ కనబడితే చేత్తో పుచ్చుకుని మరీ బస్సు దిగాడు. తనకన్నా ముందుగా బస్సు దిగిపోయిన వాళ్ళెవరో మర్చిపోయి వుంటారనీ, అయ్యో మర్చిపోయాననీ అరుస్తూ వెంటనే వెనక్కొస్తారనీ చూస్తూ కారేజీ చేత్తో పైకెత్తి పట్టుకుని కొంతదూరం నడిచాడు రాఘవరావు. కాని ఎవరూ ముందుకు రాలేదు. (అదే, వెనక్కి రాలేదు) సరేకదా అని ఇంటికి తెచ్చాడు. అక్కడ కారేజీ విప్పిచూస్తే దాంట్లో సరికొత్త చీర వొకటుంది, బిల్లుతో సహా కవర్‌లో పెట్టి.

ఇతను బాత్‌రూమ్‌లోంచి వచ్చేలోగా వాళ్ళావిడ కారేజీ తెరిచి చూసి అందులో చీరెను గమనించి "దేనికోసం కొన్నారీ చీర?" అని డబాయించడం, "అయ్య బాబోయ్! నీకే చీరెలు కొన్లేక చస్తూంటే ఇదో అపవాదూ అప్రదిష్టానా" అని ఇతను. ఓ అరగంటపాటు డ్రిల్లు చెయ్యడమూ అది వేరేకథ. మొత్తాని కెలాగైతేనేం పనిమనిషి దసరాకి చీరపెట్టమని అడిగితే సంక్రాంతికి వాయిదా వేసి, మళ్ళీ మొన్న సంక్రాంతికి ఏదో వూరడింపుమాట చెప్పి ఖర్చు తప్పించుకోవడం వల్ల ఈ చీర పనిమనిషి కిచ్చేస్తే బావుంటుందని నిశ్చయానికొచ్చే రుభయులూనూ.

"ఆరేళ్ళమట్టీ అరిసేతు లరిగిపొయ్యేలా మీ యెంగిలి సిప్పలు తోముతూవుంటే నానేటడిగినాను; ఒక్క సీరేగద! దసరాకి అడిగితే సంకురాత్రి కిస్తామన్నారు.సంకురాత్రికడిగితే కొత్తమాస కిస్తానంతారు" అని ఆ సాయంకాలం కూడా పనిమనిషి దండకం చదివిందిట.

"పోనీలే సంకురాత్రికి కాకపోతే శివరాత్రికి కట్టుకో" అని ఆ చీర తెచ్చి నూకాలమ్మ కిచ్చేసరికి——

"అయితే అమ్మగారూ! ఈ సీరతోబాటు జెర్మన్ సిల్వరు కారేజీ వుండాల; అది కూడా ఇచ్చిరా? నాను నిన్నటాల చిటీ బస్సులో వొగ్గిసి మర్సిపోన్ను" అనేసరికి——

రాఘవరావు మొహం ఎలా అయిందో చెప్పనా?

ఒద్దులెండి, మీరే వూహించుకోగలరు. ఆ మాత్రం నమ్మకం నాకుంది.

(30-1-84)